నిధుల మంజూరుకు కమిషనర్‌కు వినతి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

మన్సూరాబాద్: డివిజన్‌లోని పెండింగ్ పనులతో పాటు డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీకి ఈస్ట్‌జోన్ (ఎల్‌బీ నగర్‌జోన్) నుంచి పన్నులు ఏ స్థాయిలో వసూలు అవుతున్నాయో.. అదేస్థాయిలో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. నగర శివారు ప్రాంతాల్లో నూతన కాలనీలు వెలుస్తున్నాయని, దీంతో అధిక నిధులను కేటాయించాలని వినతిలో కోరినట్లు ఆయన వెల్లడించారు.

సమస్యల పరిష్కారాలకు..

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని సమస్యల పరిష్కారాలకు గురువారం కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో జలమండలి, జీహెచ్‌ఎంసీ మధ్య సమన్వయం లోపంతో కాలనీలలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. గతంలో కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించినందుకు రూ.1.76 కోట్ల వరకు జలమండలి శాఖకు రోడ్ కటింగ్‌కు డబ్బులు కట్టాలని జీహెచ్‌ఎంసీ నోటీసు ఇచ్చిన పనులు జరగడం లేదని వర్షాకాలంలో రోడ్లన్నీ బురదగా మారి నడవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. గాయత్రిపురం, నాగేశ్వర్ నగర్, శ్రీ రామలింగేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ మీదుగా మూసీ వరకు బాక్స్ డ్రెయిన్ లైన్ గతేడాదితో ప్రారంభించి పనులను సగంలోనే ఆపేశారని దీంతో దిగువన ఉన్న 9 కాలనీలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తి చేయాలని వినతిలో కోరారు.

ఇబ్బందులు తలెత్తకుండా పూడికతీత పనులు


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య

మన్సూరాబాద్: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాలాల్లో పూడికతీత పనులను చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్ పరిధి ఆగమయ్యనగర్‌కాలనీలో నాలా పూడికతీత పనులను హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమం ఇన్‌చార్జి మంజుల, ఇంజినీరింగ్ ఈఈ రమేష్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, జవాన్ శ్రీనివాసరావు, కాలనీవాసులు కరుణాకర్, భాస్కర్, శ్రీరాములు, ఆనందం, వీణారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

వనస్థలిపురం: రంగారెడ్డి జిల్లా పరిధిలోని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని లేబర్ రూమ్, ల్యాబ్, ఫిజియోథెరపీ వార్డు, ఆసుపత్రి ఆవరణలో ఉన్న సఖీకేంద్రం, పార్కింగ్ పరిసరాలను పరిశీలించారు. రోగులు, సిబ్బందికి సంబంధించిన సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశాలిచ్చారు. రోడువారి వెంట డా.జి.రాజు యాదవ్, టీఎస్ ఎంఐడీసీ అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న క్రిస్టినా చోంగ్తు, కలెక్టర్ శశాంక

సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు సాగాలి


సమావేశానికి హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులంతా ఐక్యతతో ముందుకు సాగాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రహం పిలుపునిచ్చారు.గురువారం నల్లగొండ క్రాస్‌రోడ్డులోని ఎంబీ చర్చిలో జరిగిన మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఎంబీ చర్చి సీనియర్ పాస్టర్, రెవరెండ్ డాక్టర్ మెన్నోజోయల్, అక్బర్‌బాగ్ హోరేబు హౌజ్ ఆఫ్ వర్షిప్ పాస్టర్ మోజెస్ పాల్గొని దైవ సందేశం అందించారు. అనంతరం సర్వమానవళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..క్రైస్తవుల మీద జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడ సాల్మన్, అసోసియేషన్ నాయకులు, చర్చి పాస్టర్లు, చర్చిల పెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాలలో దోమలు స్వైర విహారంతో అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లో యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజున్నీసా బేగం, నాయకులు షఫీయుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న కోట్ల శ్రీనివాస్

వాణీనగర్‌కాలనీలో..

సైదాబాద్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వాణీనగర్‌కాలనీలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజారోగ్యానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వర్షాకాలంలో వృద్ధులు, చిన్నారులు త్వరగా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అప్రమత్తతే ఆరోగ్యానికి భద్రత!

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి
- సాక్షితో వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డా.ఎన్.కృష్ణ




వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో బారులుతీరిన అవుట్ పేషెంట్లు

వనస్థలిపురం: వర్షాకాలం, వాతావరణం మార్పులు, దోమలతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. మొదట్లోనే వ్యాధిని గుర్తిస్తే సరైన చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డా.ఎన్.కృష్ణ అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోగాలు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలపై ఆయన సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: ప్రస్తుతం కాలంలో ఎలాంటి వ్యాధులు వస్తాయి.. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

డాక్టర్: మామూలుగా వర్షాకాలంలో మలేరియా, డయేరియా, ఫీవర్, డెంగీ, చికన్‌గున్యా తదితర రోగాలు వస్తుంటాయి. ఈ కాలంలో విషజ్వరాలు, డెంగీ, ఆర్‌ఎస్‌వీ (రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్) వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయి. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, ఇన్‌పేషంట్లకు కావాల్సిన బెడ్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: ఆసుపత్రికి రోగుల తాకిడి ఎలా ఉంది.. ఎలాంటి రుగ్మతలతో ఎక్కువగా వస్తున్నారు?

డాక్టర్: గతంలో పోలిస్తే ఓపీ కేసులు పెరుగుతున్నాయి. వర్షాకాలానికి ముందు రోజుకి దాదాపుగా 4 నుంచి 5 వందల ఓపీ కేసులు ఉండగా ప్రస్తుతం రోజుకు 6 వందల మంది వస్తున్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, తదితర లక్షణాలతో వస్తున్నారు. వారిలో రోజు 20–30 మంది వరకు డెంగీ పాజిటివ్ వస్తోంది.

ప్రశ్న: వ్యాధులు ప్రబలడానికి కారణాలేంటి? ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి?

డాక్టర్: వర్షాకాలంలో నీటి గుంతలు, ఇళ్లల్లో ఉండే కుండీలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతాయి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. పగటిపూట కుట్టే దోమలతో డెంగీ వస్తోంది. దోమలు కుట్టకుండా దోమతెరలు, చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.

ప్రశ్న: రుగ్మతల బారిన పడిన వారికి మీరిచ్చే సలహాలేమిటి?

డాక్టర్: వ్యాధుల బారిన పడినవారు మొదటి రోజు నుంచే చికిత్స పొందితే త్వరగా కోలుకునే అవకాశం ఉంది. జ్వర పీడితులు పారాసెటమాల్ మాత్ర, ఓఆర్‌ఎస్ ద్రవం, పండ్ల రసాలు, సరైన విశ్రాంతి తీసుకోవాలి. అనవసరమైన యాంటీ బయోటిక్ మందులు తీసుకోరాదు. సాధ్యమైనంత వరకు నిల్వ ఉంచి, బయటి పదార్థాలు తీసుకోవద్దు. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని మాత్రమే తాగాలి. చిన్న చిన్న విషయాలకు ఆందోళనకు గురై ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోరాదు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..

టమోటా రూ.25, వంకాయ రూ.35, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.38, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.23, కీర రూ.25, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.50.

ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దుర్గాదేవి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయి గణేష్‌యాదవ్ తెలిపారు. ప్రతి శుక్రవారం దుర్గాదేవి ప్రత్యేక అలంకారణలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. నేడు వల్మీక-నాగభరణ అలంకరంలో దర్శనమిస్తారని, ఈ నెల 16న అష్టోత్తర వల్యాల (108చీరలతో) ప్రత్యేక అలంకరణ, 23న సకలఫల అలంకారం, 30న హరిద్రాసూత్రం అలంకరంతో సామూహిక లలిత సాహస్రనాం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పోచమ్మ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

నాగోలు: అందరూ ఆధ్యాత్మిక చింతను పెంపొందించుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గురువారం నాగోలు డివిజన్ బండ్లగూడలోని వినాయక్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోచమ్మ తల్లి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.గుడి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా 50 సిమెంట్ బస్తాలు ఇచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల బాలమ్మ నరహరి,రఘు, నూనె శివశంకర్, రాఘవేందర్ ,బాబు చారి, మధు. దమయంతి, రవి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం ఆమె అధికారులతో కలిసి సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో డ్రైనేజీ పొంగకుండా నాలాలలో పూడికతీత పనులను సత్వరమే చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ హేమానాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి హర్ ఘర్ తిరంగా


కార్యకర్తలతో చర్చిస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: గత కొన్నేళ్లుగా దేశ ప్రజలతో పాటు బీజేపీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకుంటున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు డివిజన్, బూత్‌స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలపై గురువారం ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 9 గంటలకు బీఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధి తెలంగాణ చౌరస్తా నుంచి వనస్థలిపురం రైతుబజార్ వరకు 75 మీటర్ల జాతీయ జెండా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆగస్టు 15 వరకు ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, క్లైం నవజీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, నాయకులు నాంపల్లి రామేశ్వర్, నందికొండ గీతారెడ్డి, విజయ్‌కుమార్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు వార్డు కార్యాలయాల్లో ఇవ్వాలి


డీసీ జయంత్

చాదర్‌ఘాట్: ప్రజాపాలన దరఖాస్తులను డివిజన్ వార్డు కార్యాలయాల్లో ఇవ్వాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు డివిజన్‌లలోని వార్డు కార్యాలయాల్లో ఒక అధికారితో పాటు కంప్యూటర్ ఆపరేటర్‌ను ఉంటారన్నారు.

- సైదాబాద్ డివిజన్- సింగిరెడ్డి భవన్ మొదటి అంతస్తు పార్లేజీ బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద సైదాబాద్
- మూసారాంబాగ్- ఫ్రెండ్స్ కాలనీ పిస్తా హౌజ్
- ఓల్డ్‌మలక్‌పేట- అఫ్జల్‌నగర్ సాలార్ ఈ-మిలాద్ పార్కు వద్ద
- అక్బర్‌బాగ్ - బీబ్లాక్ క్వార్టర్స్ వద్ద
- డబీర్‌పురా -నూర్‌ఖాన్ బజార్ చార్‌షెట్టి కైతా ప్లేగ్రౌండ్ వద్ద
- అజంపురా - అజంపురా కాంటా వద్ద చావునీ-హనుమాన్ గుడి వద్ద దరఖాస్తులు సమర్పించాలన్నారు.

కాలేజీలో సీటు ఇప్పిస్తానని 1.40 లక్షలు వసూలు

- తిరిగి డబ్బులు ఇవ్వమన్నందుకు కులం పేరుతో దూషణ
- తల్లి, కొడుకుపై కేసు నమోదు

నాగోలు: ఓ కళాశాలలో సీటు ఇప్పిస్తాని చెప్పి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా అడిగినందుకు కులం పేరుతో దూషించిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు బండ్లగూడ ఆనంద్‌నగర్‌లో ఉండే కత్తి జశ్వంత్ అలియాస్ బబ్లు, మీర్‌పేటకు చెందిన స్రవంతి స్నేహితురాలు ప్రేమలత కుమారుడికి ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి ప్రేమలత నుంచి రూ.80 వేలు తీసుకున్నాడు. స్రవంతి సోదరుడికి సీటు ఇప్పిస్తానని మరో రూ. 60 వేలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకుని సీటు ఇప్పించకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో స్రవంతి ప్రేమలత, ఇతర కుటుంబ సభ్యులు గతంలో జశ్వంత్ ఇంటికి వెళ్లి డబ్బుల గురించి నిలదీయగా జశ్వంత్ తండ్రి భిక్షపతి 3 నెలల్లో ఇస్తామని ఒప్పుకున్నాడు. అతను ఇచ్చిన సమయం కూడా మించిపోవడంతో మంగళవారం జశ్వంత్ ఇంటికెళ్లి నిలదీశారు. జశ్వంత్‌తో పాటు అతడి తల్లి వాణి ఇంటికి ఎందుకొస్తున్నారంటూ కులం పేరుతో స్రవంతిని దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జశ్వంత్, వాణిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

చంపాపేట: కేరళ వయనాడ్ బాధితులకు అండగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లేపాక వీరయ్య అన్నారు. గురువారం ఆయన సర్కిల్ సీఐటీయూ కార్మికులతో కలిసి చైతన్యపురి డివిజన్ పరిధిలోని వ్యాపార కేంద్రాలు, ఇళ్ల వద్దకెళ్లి విరాళాలు, దుస్తులు, వంట సరుకులు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కార్మికులు యాదయ్య, భిక్షపతి, ఈదమ్మ, జంగమ్మ, లక్ష్మీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

జోరుగా స్వచ్ఛదనం-పచ్చదనం

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం జోరుగా సాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా డివిజన్లలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వచ్ఛదనం పాటిస్తే ఆరోగ్యంగా, పచ్చదనం పెంపొందిస్తే ఆహ్లాదంగా ఉంటామన్నారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్లబృందం


మొక్కలు అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


నాగోలు వెంకటరమణ కాలనీలో నాలాలో మట్టి తీయిస్తున్న డిప్యూటీ కమిషనర్ యాదయ్య, నాగోలు కార్పొరేటర్ అరుణ సురేందర్


రాజిరెడ్డి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, అధికారులు

కాలనీ సంక్షేమ సంఘం భవనం ప్రారంభం


నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

చంపాపేట: కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు సర్కిల్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి కాలనీల అభివృద్ధిలో స్థానికులు భాగస్వాములు కావాలని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి డివిజన్ శ్రీపురం కాలనీ ఫేస్–2లో కాలనీ సంక్షేమ సంఘం నూతన భవనాన్ని ఆయన స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. జ్ఞానేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, జంగయ్యగౌడ్, నర్సింహారెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు బీమా వసతి కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న కార్మికులు

హయత్‌నగర్: భవన నిర్మాణ కార్మికులకు కనీస సౌకర్యాలు, బీమా వసతి కల్పించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ అన్నారు. రాజీవ్‌గాంధీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పెద్దూరె బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన హయత్‌నగర్ డివిజన్ భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌లో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులు తిరిగి వాటిని రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్మికులకు ప్రభుత్వం ద్వారా బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న శ్రీకృష్ణ రాఘవేందర్

మన్సూరాబాద్: కొన్ని రోజులుగా వైరల్ ఫీవర్ ఎక్కువగా వస్తున్నాయని, తగు జాగ్రత్తలతో వాటి నుంచి రక్షణ కాపాడుకోవచ్చని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ వైద్యులు శ్రీకృష్ణరాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో చిన్నపిల్లలకు మాత్రమే వైరల్ ఫీవర్ వచ్చేవని ప్రస్తుతకాలంలో యువకులు, పెద్దలకు సైతం వస్తున్నాయన్నారు. ముఖ్యంగా బయటి ఆహారం తినకూడదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులు

నాగోలు: శ్రావణమాసంలో శుభకార్యాలు, పెళ్లిళ్లకు ఆర్టీసీ బస్సులు రాయితీపై అద్దెకు ఇస్తున్నట్లు బండ్లగూడ డీఎం వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అదనపు డిపాజిట్‌లు తీసుకోవడం లేదని సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. పూర్తి వివరాలకు 9959224058 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చెక్కు అందజేత

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్‌కు చెందిన రాంరెడ్డికి సీఎం ఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహిళల రక్షణే షీ-టీమ్ లక్ష్యం


పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

నాగోలు: మహిళల రక్షణే షీటీమ్ లక్ష్యమని పోలీస్ కమిషనర్ సుదీర్‌బాబు వెల్లడించారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీటీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తూ స్తున్నారన్నారు. పోకిరీలను పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పర్చి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో వేధింపులకు పాల్పడిన మేజర్లు 68, మైనర్లు70కు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. మహిళలు వేధిస్తే వాట్సాప్ నెంబర్ 8712662111కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్స్ ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, సిబ్బంది, పాల్గొన్నారు.

అద్దెకున్న ఇంట్లో నిర్బంధించి డబ్బులు వసూలు

- ఇంటి యజమానితో పాటు భార్య, కుమార్తెపై కేసు

నాగోలు: అద్దె ఇంట్లో ఉంటున్న ఓ యువతి విదేశాల్లో చదువుల కోసం సహోద్యోగితో కలిసి పేపర్ వర్క్ చేస్తుండగా ఇంటి యజమానితో పాటు భార్య, కుమార్తె వారిని నిర్బంధించి డబ్బులు దోచుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మన్సూరాబాద్, సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఓ యువతి మల్‌రెడ్డి బాల్‌రెడ్డి అనే వ్యక్తి నివాసంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటూ విదేశాల్లో చదువుల కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఆమె సహోద్యోగి అయిన ఉదయ్‌కుమార్ గత నెల 24న ఆమె ఉంటున్న ఇంటికి వచ్చి ఇద్దరు కలిసి విదేశాల్లో చదువుల కోసం పేపర్ వర్క్ చేస్తున్నారు. ఇది గమనించిన బాల్‌రెడ్డి, అతని భార్య పుష్పలత, కుమార్తె వారున్న గది తలుపులకు బయట నుంచి తాళం చేశారు. యువతి గదిలో ఉన్న ఉదయ్‌కుమార్‌ను తప్పుగా భావిస్తూ డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. భయపడిన ఉదయ్‌కుమార్ తన దగ్గర ఉన్న బ్యాంక్ చెక్ ఇవ్వగా బాల్‌రెడ్డి ఎల్‌బీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి రూ. 3.50 లక్షలు డ్రా చేసుకున్నాడు. ఆ తర్వాత బాల్‌రెడ్డి మరోసారి ఓ పాఠశాల బస్సు డ్రైవర్‌తో కలిసి బుధవారం ఉదయ్‌కుమార్ బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.